# దే వ మ్మ

**రామదాసు** హుషారుగా రిక్షా తొక్కుకుంటూ గంట గణగణ మోగించుకుంటూ ముందుకు సాగిపోతున్నాడు.

అతనేం జనసమ్మర్థమైన రోడ్డుమీంచి పోకపోయినా అతని ఆనందానికి చిహ్నంగా గంట మోగించుకుంటున్నాడు.

మొదటి ఆట సినిమా వదిలేయడం, రెండో ఆట మొదలు పెట్టడం అయింది. సుమారు రాత్రి పదిన్నర దాటింది.

'రిక్షా వస్తావా' అంటూ యిద్దరు ముగ్గురు అడిగినా దాసు 'రాదండి-రాదండి' అని తాళయుక్తంగా చెప్పుకుంటూ దూసుకుపోతున్నాడు.

లక్ష్మిటాకీసులోంచి సినిమా మాటలు గట్టిగా బయట రోడ్డుమీదకి వినిపిస్తున్నాయి.

'ఛీ! కులటా! నీ ముఖం నాకు చూపించకు. పో బయటకి పో!' అంటూ అరుస్తోంది పురుష కంఠం.

దాసు ఆ చిత్రం నిన్ననే చూశాడు. సన్నివేశం గుర్తుకొచ్చింది నిట్టూర్చాడు. ఆడదంటె మగాడికెంత లోకువ అనుకున్నాడు. అంతలోనే మళ్ళీ తన వుత్సాహంలో పడిపోయాడు. మనసంతా ఆనందంతో వుర్రకలు వెయ్యడం మొదలు పెట్టింది.

అతను ప్రొద్దుట ఆరున్నరకి రిక్షా వేసుకుని యింట్లోంచి బయట కొచ్చాడు. సొంతబండి కావటంవల్ల అద్దె కట్టె బాధలేదు. రెండింటికో, నాలుగింటికో షావుకారికి బండి వొప్పగించాలనే బెంగలేదు—

అతనికి ఆరోజు తనని వరించిన అదృష్టదేవత గుర్తుకొస్తోంది. పొద్దున్నే తన రిక్షా ఎక్కినామె అతనికి పదే పదే గుర్తుకొస్తోంది. అచ్చంగా ఆమె ఆకాశంలోంచి దిగివచ్చిన దేవతలాగా వుంది. అప్పుడే విరిసిన ముద్ద నందివర్ధనం పువ్వులా తెల్లని బట్టల్లో స్వచ్ఛంగా, అందంగా వుంది.

నిజానికి బోణీబేరం కదాని రెండు రూపాయలకి తగ్గని బేరం రూపాయిన్నరకే వెళ్ళాడు. కాని ఆయమ్మ బండిలో కాలెట్టిన లగాయితూ ఎన్ని బేరాలు తొక్కాడు? అదేమిటో ఎక్కిన వాళ్ళంతా తనెంత అడిగితే అంతా యిచ్చేశారు. ఒక్కొక్కసారి తను మరి దిలాసాగా ఎక్కువే అడిగినా అది యిచ్చేసి ఎక్కారు. మధ్యాహ్నం కూడు తినేందుకు కూడా టైము దొరకలేదు. బజ్జీలు తిని టీ తాగాడు-సాయంత్రం ఆరుగంటలకి రెండు జొన్నపొత్తులు కొనుక్కుని తిన్నాడు. నిజానికి కడుపులో ఆకలి కంటె ఆనందం ఎక్కువగా వుంది. యాభైమూడు రూపాయలు వచ్చాయి. మూడ్రూపాయలు పెట్టి కుంకజ్జం కొని సీటుకింద పెట్టాడు. ఇంట్లో ఆడదివేళ గుమ్మెత్తిపోవాలి.

దాసుకి చిన్నప్పటినుంచి బోణీ అనేది ఎంతో నమ్మకం. బోణీ మంచిదయితే విశ్రాంతి వుండదు. లక్ష్మి ఘల్లు ఘల్లు మంటూ వస్తుంది. ఒక్కొక్క మదనష్టపు బోణీపడిన రోజున ఎక్కడికెళ్ళినా దరిద్రమే- ఇది దాసు నమ్మకం.

అందుకే దాసుకివేళ తెల్లబట్టల దేవమ్మ బాగా గుర్తుకొస్తోంది. ఆమె స్కూలుకు బయలుదేరేవేళ చూసి, పదిపైసలైనా ఆమెని తన రిక్షాలో ఎక్కించుకుని తీసుకుపోవాలి. ఆమె కాలుమోపిందంటె చాలు. అదే పదివేలు.

*

మరుసటిరోజూ ఆపై రోజూకూడా దేవమ్మని పైమకి పట్టుకోలేక పోయాడు. ఆమె ముందే వెళ్ళిపోయిందో, మరేమైందో తెలీదుగాని అతనికామె కనపడలేదు. దానికి తగ్గట్టుగా అతనికా రెండు రోజులూ బేరాల్లేవు. పన్నెండు రూపాయలు రావడం గగనమైంది.

దేవమ్మ బోణీమీద అతనికి మోజు మరీ ఎక్కువైపోయింది. మూడోరోజు అతను తెలతెలవారుతుండగానే బయలుదేరి రోడ్డు మొగసాల నిలచాడు. దూరంగా ఆమె కనిపించగానే అతనికి సాక్షాత్తు అదృష్టదేవత కదిలివస్తున్నట్లనిపించింది. ఆమె పక్కన హుందాగా, నిండుగా వున్నాయన్ను చూసి ' బాబుగారు ' అనుకుని బండితీసి వుత్సాహంగా ఎదురెళ్ళాడు.

తీరా దగ్గర కెళ్ళాక తెలిసింది, ఆమెందుకో చాలా కోపంగా వుంది. ధుమధుమలాడుతూ రిక్షా ఎక్కింది. అతని ముఖం అశాంతిగా, దుఃఖావంగా వుంది. అతనూ ఎక్కాడు. దాసులో ఉత్సాహం చచ్చిపోయింది. తెల్లని మల్లెపువ్వులాంటి బట్టల్లోవున్న దేవమ్మ చిరచిరలాడుతుంటే ఎలాగో అయింది. బండి వేగాన్ని పుంజుకుంది.

బాబుగారు మాత్రం ఆమెని సముదాయించే ధోరణిలో నెమ్మదిగా మొదలుపెట్టాడు.

" ప్రతి చిన్న విషయానికి నువ్విలా కోపగించుకుంటే ఎలా ? "

ఆమె గయ్యిమని లేచింది. "నా ఖర్మేం పట్టింది. నా యిష్ట మొచ్చినట్లు నేనుంటాను. నాకు మీరేం పెట్టి పోషించటంలేదు. నా అన్నం నే తింటున్నా. నా యిష్టం వచ్చినట్లుంటాను " ఆమె గొంతులో ధ్వనించిన ఛీత్కారానికి బాబుగారెలా బాధపడ్డాడోగాని దాసు మాత్రం విలవిల్లాడి పోయాడు. దేవమ్మ మాట్లాడే పద్ధతి దాసు కెంతమాత్రం నచ్చలేదు. నెమ్మదిగా బాబుగారన్న మాటలకి మళ్ళీ గొంతుచించుకుంది.

" మీ హద్దుల్లో మీరుండండి. నాకేం చెప్పక్కర్లేదు. మిమ్మల్ని కట్టుకున్నందుకు నా ముఖాన ఏ సుఖమూ లేదు. ఎంతసేపూ మీ వాళ్ళూ, మీ గోలే " అంటూ అతన్ని మరెంత సాసదించింది. విదిలించి పారేసింది. ఆమె గొంతు రోడ్డుమీద పోయేవారు కొందరు ఆశ్చర్యంగా విని ముందుకెళ్ళిపోయారు.

దాసుకి వొళ్ళుమండిపోయింది. దేవమ్మ యిలా మాట్లాడ్డం అతనికెంతో అవమానమనిపించింది. బాబుగారు గంటుముఖం పెట్టుకుని కూర్చుని వుంటారని చూడకుండానే గ్రహించాడు దాసు. ఓరకంటతో చూడనూ చూశాడు. ఇద్దరూ ఎడముఖం, పెడముఖం పెట్టుకుని కూర్చున్నారు. మాటలబట్టి చూస్తే అమ్మగారిదే తప్పనిపించింది దాసుకి. భార్యాభర్తలన్నాక పోట్లాటలూ తప్పవు పొంగిపోవడాలూ తప్పవు. అయినా పెళ్ళామిలా మొగుడ్ని తీసిపారేయకూడదనిపించిందతనికి.

రిక్షా ఆగింది. ఆమె పురికినట్లు దిగి స్కూల్లో కెళ్ళిపోయింది. బాబుగారు మాత్రం డబ్బులిచ్చి అడుగులో అడుగు వేసుకుంటూ వెళ్ళిపోయారు.

పూర్తిగా గొడవేమిటో తెలీకపోయినా దేవమ్మ అలా మాట్లాడకూడదనిపించింది దాసుకి—అదే తనైతే సిగపాయితీసి తన్నీసివాడు. నిజంగా బాబు శాంతమూర్తే అనుకున్నాడు—

ఆరోజు కూడా దాసుకి డబ్బులు గలగల రాలాయి.

రాత్రి వేడి వేడి అన్నంలో వుల్లికారం కలుపుకుని అన్నం తింటూ దుర్గతో సినిమా కథలాగా యిదంతా చెప్పాడు దాసు.

" ఏంటయ్యో ? అట్టాగంటావు ? ఎంత బాధైందో—లేపోతే ఆయమ్మ అంతలేసి మాటలంటుందా ?" అంది దుర్గ.

" మనకేటి తెలీదనుకో అయినా అంతలేసి మాటంనకోడదే దుర్గా, అంతదలపరస్తే ఏం బాగుంటుంది ? " అన్నాడు.

"అన్ననూ ! నిజమే. ఆమెగారు సంపాదించుకుంటావుంది. దరిజాగా బతుకుతావుంది. అందుకనలా అంది " అంటూ సమర్థించింది దుర్గ.

" ఎన్నైనా చెప్పు నేనైతే నాలుగంటించివాడ్ని. సంపాదిస్తే మాత్రం నచ్చినట్టు పడుండాలి పెళ్ళాలంటే " అన్నాడు అతని మాటల్లో కొంచెతనం ధ్వనించింది.

" ఎందుకు పడుండాలయ్యా ? నాలుగు తన్నిసూడు. నేనుంటానేమో సూద్దువుగాని " అంది.

" నువ్వలాంటిమాట లెన్నడైనా అన్నావా " అన్నాడు. దుర్గ పొంగిపోయింది.

" సాల్లేవయ్యా ! అయన్ని సదువుకున్నోళ్ళ గొడవలు. ఆళ్ళే సూసుకుంటారు " అంది సర్దిచెప్తున్నట్లు.

దాసు నవ్వాడు " ఆళ్ళే సూసుకోక మనం సూస్తామా ఏంటి ?" అన్నాడు.

దుర్గేం మాట్లాడలేదు.

" ఏదైనా ఆయమ్మ కాలెట్టిందంటే బండిలో ఆరోజు కాసులు రాలాల్సిందే " అన్నాడు అవులిస్తూ.

" ఎవురి పిచ్చి ఆరి కానందం " అని ముక్తాయించింది.

*

ఆ తర్వాత దేవమ్మ దాసు రిక్షా రెండు మూడు సార్లెక్కింది. ఒసారి ముచ్చటగా ఇద్దరే పిల్లల్ని తీసుకు నెక్కింది. మరోసారి మొగుడితో ఎక్కింది. రిక్షా నడిచినంతసేపు కొట్లాట జరుగుతూనే వుంది.

బాబుగారు ప్రతిమాలుతూనే వున్నాడు. ఆయమ్మ రెచ్చిపోతూనే వుంది. దాసుకి వాళ్ళు మండిపోతూనే వుంది—

అయితే ఆరోజు కాసులు మాత్రం బాగా రాలాయి.

*

ఆరోజు డిశంబరు ముప్ఫైఒకటి. పొద్దుటనుండి ఒకటే వాన కురిసి కురిసి సాయంత్రం నాలుగ్గంటలకి ఆకాశం తెరిపిన పడింది. ప్రజల్లో వుత్సాహం మేల్కొంది. కొత్త సంవత్సరానికి ఆహ్వానం పాత సంవత్సరానికి వీడ్కోలు-పార్టీలు-హడావిడి అన్నీ ఈ వర్షంలో కొట్టుకుపోయాయని బెంగపెట్టేసుకున్న రసజ్ఞులందరికీ ప్రాణాలు లేచి వచ్చాయి.

పొద్దుటనుండి వానతో విసిగిపోయిన దాసు ఆనందంగా బండి తీశాడు. ఆరోజు రాత్రి హడావిడి వుంటుంది. నాలుగు బేరాలు తగిలితే వుషారుగా వుంటుందని బయలుదేరాడు.

"ఇయ్యాల రాత్రంతా రాను. తెల్లారొస్తా. తలుపేసుకు పడుకో" అని యింట్లో చెప్పేసి మరి బయలుదేరాడు దాసు.

చీకటిపడినకొద్దీ జనసంచారం పెరుగుతోంది. న్యూయియర్ కేక్స్ షణాలమీద అమర్చారు బ్యాకరీలవారు. బారులన్నీ బాహాటంగా సన్నాహాలు మొదలుపెట్టాయి. బ్రాందిషాపుల్లో దీపాలు వెలిగాయి.

ఆ మారుమూల సందులో ఎవరో కాలేజి కుర్రాళ్ళని దింపి వస్తున్నాడు దాసు. అప్పుడు రాత్రి పది దాటింది. దూరంగా దీపస్తంభంకి ఎడంగా రెండు ఆకారాలు నిలబడి వున్నాయి. ఒకరి కొకరు దగ్గరగా, ఏదో గుసగుసలాడుకుంటున్నట్లు మాటలు. దాసు ముందుకు పోబోయి నెమ్మదిగా బండి ఆపాడు.

"వస్తావా రిక్షా !" అన్న మాటలు విని సీటుమీంచి దిగాడు క్రీనీడలో చిన్న సూట్‌కేసుతో నిలబడిన దేవమ్మని చూసి గతుక్కు మన్నాడు. తుళ్ళిపడి పక్కనున్న మనిషిని చూశాడు, బాబుగారు కాదు నల్లగా వున్నాడు. కళ్ళకి జోడు. రింగుల క్రాపు-గళ్ళలాల్చి-నోట్లో కిళ్ళీ. దొంగకోళ్ళు కొట్టేవాటంగా అనిపించింది దాసుకి. దాసుకి కడుపులో గాభరాగా అయింది. పోకరివాళ్ళనే ఆడాళ్ళెక్కువ యిష్టపడతారేమో అనిపించింది. అతని కేదో తెలియకుండానే తెలిసిపోతోంది. ఆయమ్మ తనని చూస్తుందేమోనని ముఖంమీంచి తువ్వాలు పాగా చుట్టాడు. దొంగ కోళ్ళగాడు బేరమేమీ ఆడలేదు. ఎగిరి రిక్షాలో పడ్డాడు. ఆమె అతని పక్కన

విధిలేనట్టు రిక్షా కదిలింది.

దాసుకి విపరీతమైన నిస్సత్తువ ఆవహించింది. తనెందుకు బేరం వొప్పుకున్నానా అని కంగారు మొదలైంది.

దేవమ్మ అతన్ని గుర్తించే స్థితిలో లేదు. ఆమె కసలు అతను తెలియనే తెలియదు.

"నీ నగలేమైనా తెచ్చావా"

"ఆ....తెచ్చాను"

"నీ సర్టిఫికెట్లు అన్నీ వున్నాయా"

"ఆ....వున్నాయి"

"మరేం భయంలేదు"

ఇద్దరూ మరీ చేదువైనట్టు. మరేదో జరిగినట్టు. రామదాసు వొళ్ళంతా కారం రాసినట్లు, కంపరంగా చిరచిరలాడిపోయింది—

"పిల్లల్ని వదిలి వచ్చేస్తున్నాను" ఆమె గుసగుస — అతనేదో సముదాయిస్తున్న ధ్వని.

దాసుకి కాం(డించి ఫుమ్మాలనిపించింది. ఇన్నాళ్ళూ తను దేవమ్మ అనుకున్నామె దయ్యంలా కనిపించింది. సంఘానికి చీడపురుగులా అనిపించింది. చదువు సంధ్యలులేని దాసుకి ఈ చదువులన్నీ తగలెట్టా లనిపించింది. ఎప్పుడూ బతిమాలుతూవుండే బాబుగారి ముఖం వాడి కళ్ళకు కట్టింది. అందమైన రాక్షసిని దేవమ్మలో చూస్తున్నాడు వాడు—

వాడిలో అసహ్యం పెల్లుబికింది. ఒక దీప స్తంభం దగ్గర అకస్మాత్తుగా రిక్షా ఆగింది. చీకట్లోంచి వెలుగులోకి వచ్చినట్లు దాసనుకున్నాడు.

"ఏం ? ఏమైంది ? తొరగా పోనీ" అన్నాయి రెండు కంఠాలూ ఏకమై.

"బండి ఎల్లదండి. మరో బండి ఎక్కండి" అంటూ దాసు సీటు దిగాడు.

"ఏం ?" దొంగకోళ్ళ గొంతులో ఆత్రుత.

"నా ప్రాణం బాగోలేదండి"

మళ్ళీ అతనేదో మాట్లాడబోయాడు.

"దిగండయ్యా సంపక" అన్నాడు అందులో ఎంతో విసుగు ధ్వనించింది. ఏమనుకున్నారో యిద్దరూ దిగి చీకట్లో కలిసిపోయారు.

లేచిపోయిన పెళ్ళాం తాలూకు మొగుడు మర్నాడు ఈ సంఘంలో ఎంత అవమానం పొందుతాడో !

ఏం జరిగిందో తెలీని పసిపిల్లలు తల్లికోసం ఎలా తల్లడిల్లిపోతారో, అతనూహించి కలగిపోతున్నాడు. అతనికున్న పరిధిలో అతనికి కొన్ని నీతులున్నాయి, నియమాలున్నాయి, ఆత్మవిమర్శలు న్యాయ నిర్ణయాలు వున్నాయి. బయటపడి ఆ భార్యాభర్తలు విడిపోయినా దాసు యింత అసహ్యించుకునేవాడు కాదేమో !

ఆలోచించుకుంటూ, ఆవేదన పడిపోతూ దాసు యింటివైపు తిరిగాడు. అతనెప్పుడూ అలాంటి జంటని బండెక్కించుకోడు.

" రేత్రంతా రానన్నావుగా " అని కళ్ళు నులుపుకుంటూ తలుపు తీసింది దుర్గ.

"ఏం ? వస్తే నీకేమైనా అడ్డా?" అన్నాడు. ఆమాట చురుక్కుమని తగిలి, దుర్గ నిద్ర వదిలిపోయింది.

" ఏందయ్యోయ్-జోరుమీదున్నావు " అంది కుండలోంచి మంచినీళ్ళు ముంచుతూ-.

దాసేం మాట్లాడలేదు. మంచినీళ్ళందుకున్నాడు. దుర్గకేం అర్థం కాలేదు. కాస్సేపాగి " బేరాలేం కుదర్లేదా " అంది. దాసేం మాట్లాడలేదు.

" మీ దేవమ్మగార్నెక్కించుకుని చక్కర్లు కొట్టకపొయ్యావా డబ్బులు రాలేయి " అంది చిర్నవ్వుతో.

" ముయ్యెహే నోరు. అది దేవమ్మ కాదే దయ్యం. ఆయమ్మ కాలెడితే డబ్బులొచ్చినా అయి మన కొద్దులే " అన్నాడు విసురుగా.

దాసు వింత మాటలు దుర్గకి అర్థంకాలేదు. కళ్ళమీదకి నిద్ర ముంచుకొస్తుంటే, మొగుడి పక్కనే జేరి ముసుగుతన్నేసింది.